క్లుప్తంగా

రేపు అడెల్లిలో బహిరంగ వేలం

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహా పోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వివిధ వ్యాపార సముదాయాలకు మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో రమేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన వ్యాపారులు దేవాదాయ శాఖ నిబంధనల మేరకు దరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

అడెల్లి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా రమేశ్

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా రమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వర్తించిన దేవా దాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. నూతన ఈవోను ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అన్నాభావుసాఠేకు నివాళి



నినాదాలు చేస్తున్న నాయకులు

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామంలో ఆదివారం అన్నాభావుసాఠే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోఆప్షన్ మాజీ సభ్యుడు గజానంద్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి సాఠే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మోహన్, విజయ్, యోగేశ్, గంగాధర్, లక్ష్మణ్, దీపక్ తదితరులు ఉన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు సంబంధించిన వడ్డెర కులస్తుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. ఇందులో సంఘం అధ్యక్షుడిగా శివ భూపతి, ఉపాధ్యక్షుడిగా నడిపి ఎల్లయ్య, కోశాధికారిగా దుండగుల చిన్నయ్య ఎన్నికయ్యారు.


ఫుడ్‌బ్యాంక్‌లో జన్మదిన వేడుక



ఫుడ్‌బ్యాంక్‌లో హరిణిరెడ్డి, కుటుంబీకులు

నిర్మల్: సాధారణంగా కేక్‌లు కట్ చేసి, దోస్తులకు పార్టీలు ఇచ్చి బర్త్‌డేలను ఘనంగా చేసుకుంటుంటారు. కానీ.. ఈమధ్య కొందరు తమ పుట్టినరోజును సేవాకార్యక్రమంతో గడిపేస్తున్నారు. జిల్లాకేంద్రానికి చెందిన లోకరేణుక-లక్ష్మణ్‌రెడ్డి దంపతుల కుమార్తె హరిణిరెడ్డి ఎంబీబీఎస్ చదువుతోంది. ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఆదర్శనగర్‌లోని ఫుడ్‌బ్యాంక్ వాళ్లను సంప్రదించింది. వారితో కలిసి 100 మందికి సరిపడ ఆహారపొట్లాలను తయారు చేయించి జిల్లాకేంద్రంలోని యాచకులు, మతిస్థిమితం లేనివాళ్లకు ఒకపూట భోజనం అందించింది. కార్యక్రమంలో ఫుడ్‌బ్యాంక్ నిర్వాహకులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


ప్యారమూర్‌కు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కుభీర్: రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకుని మహారాష్ట్రలోని సొన గ్రామానికి చెందిన 30 మంది భక్తులు పాదయాత్రగా సారంగపూర్ మండలంలోని ప్యారమూర్ దత్తసాయి మందిరానికి ఆదివారం కుభీర్ మీదుగా వెళ్లారు. వారు ఏటా శ్రావణమాసంలో రాఖీపౌర్ణమి వేడుకలకు దత్తసాయి మందిరంలో పూజలు చేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



పూసిన బ్రహ్మకమలం

భైంసా: పట్టణంలోని భట్టిగల్లీకి చెందిన పిట్ల లింగయ్య ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. శ్రావణ మాసంలో పౌర్ణమి సందర్భంగా బ్రహ్మకమలం వికసించడంతో స్థానికులు వచ్చి పూజలు చేస్తున్నారు. శ్రావణంలో బ్రహ్మకమలం వికసించడం అదృష్టంగా భావిస్తున్నామని కుటుంబీకులు చెబుతున్నారు.

గుంతల రోడ్లపై ప్రయాణమెలా..?

- రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



దౌనెల్లితండా వద్ద రోడ్డుపై గుంతలు



అంబకంటి నుంచి కుంటాల వెళ్లే దారిలో ఇబ్బంది పడుతున్న ద్విచక్రవాహనదారులు

కుంటాల: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు రోడ్లపై నీరు నిలుస్తుండటంతో గుంత ఎక్కడుందో తెలియక అదుపు తప్పి కింద పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించి.. సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా కుంటాల–అంబకంటి రోడ్డు

మండలంలోని కుంటాల నుంచి అంబకంటి గ్రామానికి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 16ఏళ్ల కిందట ఈ మార్గంలో తారురోడ్డు నిర్మించారు. ఆరేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండానే ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, సారంగాపూర్ మండలంలోని ప్రసిద్ధ అడెల్లి పోచమ్మ ఆలయానికి భక్తులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రాకపోకలు సాగించేందుకు వాహనాల చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలోమీటర్ల దూరానికి పది నిమిషాల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.

అంతర్రాష్ట్ర రోడ్డు దుస్థితి..

రహదారుల అభివృద్ధి పథకంలో భాగంగా 12 ఏళ్ల కిందట రూ.కోటిన్నర వెచ్చించి కుంటాల నుంచి దౌనెల్లి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు 11కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు. ఇప్పటివరకు మరమ్మతులు చేయించకపోవడంతో రోడ్డు దెబ్బతింది. ఇటీవల దౌనెల్లి గ్రామానికి చెందిన యువకులు షేక్ ఖదీర్, అజాంలు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేయించాలని వేడుకుంటున్నారు.

భయంగానే ప్రయాణం..



మా గ్రామానికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారింది. ద్విచక్రవాహనంపై రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంది. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలుస్తుందో ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు. వాహనాలు కూడా మొరాయిస్తున్నాయి.

– జాదవ్ ప్రేమ్, అంబకంటితండా

మరమ్మతులు చేయించాలి..



కుంటాల నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. ప్రయాణికుల బాధలను గుర్తించి ఇటీవల కుంటాల సమీపంలోని వంతెన వద్ద రోడ్డుకు మరమ్మతులు చేయించాం.

– ఖదీర్, దౌనెల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తాం. సమస్య వివరించి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరగానే మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– క్రాంతి, ఇన్‌చార్జి, పీఆర్ ఏఈ

బాధిత కుటుంబాలకు సాయం



బీర్నందిలో సాయం చేస్తున్న యువకులు



కుంటాల: సాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన వెట్టి రవీందర్(30) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతడితో కలిసి బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌లో 2010–11లో పదోతరగతి చదివిన మిత్రులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా వారు రవీందర్ కూతురు భవిష్యకు రూ.10,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్, సురేశ్, రాజు, నరేశ్, సతీశ్, శ్రీకాంత్, సత్తన్న, శ్రీను, వంశీ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బెజ్జారపు చిన్నయ్య, గంగాధర్ ఇటీవల మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ ఒడ్డెపల్లి కృష్ణంరాజు ఆదివారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. రూ.ఐదు వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఓకేఆర్ మిత్ర బృందం, తదితరులున్నారు.

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన వడ్ల రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆదివారం పలువురు గ్రామస్తులు, స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.18 వేలను సాయంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది నరేశ్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడుపొద్దు

- పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తా వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందులో పట్టణ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాసర: తెలంగాణ ఆడబిడ్డలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బాసరలో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. గతంలో బాసర ఆలయ అభివృద్ధికి రూ.యాభై కోట్లు కేటాయించి నిధులు ఇవ్వని ఘనత మీదన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే బీఆర్‌ఎస్‌ను బొందపెడతారని.. కేటీఆర్ క్షమాపణ చెప్పకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు సంజీవ్ దేశాయ్, బీసీ విభాగం మండలాధ్యక్షుడు జంగం రమేశ్, పట్టణ అధ్యక్షుడు సాయిలు, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు సుద్దుల గంగాప్రసాద్ పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం’



నిరసన తెలుపుతున్న సభ్యులు

కుంటాల: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని.. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మగ్గిడి దిగంబర్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. పోరాట సమితి నాయకులు మట్ట దిగంబర్, ముద్దం భోజన్న, రాజ్‌కుమార్, బొమ్మల జగదీశ్, వాడేకర్ గంగాధర్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యవర్గాన్ని కుంటాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మగ్గిడి దిగంబర్, ఉపాధ్యక్షుడిగా మట్ట దిగంబర్, గౌరవ సలహాదారులుగా పరశురాం, డాక్టర్ నవీన్, గౌరవ అధ్యక్షుడిగా పురుషోత్తం, వినోద్, సభ్యులుగా భీమన్న, మట్ట కృష్ణ, గౌతమ్, పసుల నవీన్, వాడేకర్ బాలు, సలహాదారులుగా గజ్జారాం, మట్ట భూషణ్, తుమ్మల గంగాధర్, రాజ్ కుమార్, నగేశ్, రాజేశ్, మహిపాల్, సాయన్న ఎన్నికయ్యారు.

నేడు కొండూర్‌లో రాఖీ పౌర్ణమి

లోకేశ్వరం: నందిపేట్ మండలంలోని సీహెచ్ కొండూర్ చౌడమ్మ ఆలయ ఆవరణలో సోమవారం ఉదయం రాఖీ పౌర్ణమి జాతరను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. జాతరకు లోకేశ్వరం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

సన్మానం

ఖానాపూర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన ఖానాపూర్‌కు చెందిన అమరవేణి నర్సాగౌడ్‌ను ఆదివారం పట్టణంలో గౌడసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కాసారపు మల్లాగౌడ్, గుగ్గిల్ల రాజేందర్‌గౌడ్, అనుముల భాస్కర్, నర్సాగౌడ్, శంకర్ గౌడ్, ప్రకాశ్, జగన్ రాజేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

‘సర్వాయి’ ఆశయ సాధనకు కృషి చేయాలి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గౌడ సంఘం సభ్యులు



కడెంలో గౌడ సంఘ నాయకుల ఆధ్వర్యంలో..



లోకేశ్వరంలో..



ఖానాపూర్‌లో పూలమాల వేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్వాయి అని కొనియాడారు. గౌడ సంఘం మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా గౌడ సంఘం నాయకులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, రాజేశ్వర్, తిరుపతి, రామాగౌడ్, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాపన్న జయంతి నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పాపన్న గౌడ్ 374వ జయంతి నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో బడుగులకు రాజ్యాధికారం రావాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసారపు మల్లాగౌడ్, గుగ్గిల్ల రాజేందర్‌గౌడ్, అనుముల భాస్కర్, ఒల్లాల నర్సాగౌడ్, శంకర్‌గౌడ్, వెంకటరమణ గౌడ్, ప్రకాశ్, జగన్, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా గౌడ సంఘం సభ్యులు సర్వాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు సుందరగిరి ముత్తగౌడ్, గౌడ సంఘం నాయకులు పండరిగౌడ్, ఎర్రోల్ల స్వామిగౌడ్, పవన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, హరిగౌడ్, భూమాగౌడ్, ముత్తగౌడ్, నరేశ్‌గౌడ్, సాయాగౌడ్, నాగేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, సాయితేజ గౌడ్, పవన్‌గౌడ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రామారావును సన్మానిస్తున్న రా రైస్‌మిల్లు అసోసియేషన్ సభ్యులు

భైంసాటౌన్: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రా రైస్‌మిల్లు అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం ఎన్నికైన రా రైస్ మిల్లు అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదివారం పట్టణంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువా, పూలమాలతో సన్మానించారు. సానుకూలంగా స్పందించినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోస్లి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, కోశాధికారి గంప సందీప్, ఉపాధ్యక్షులు చిన్నయ్య, రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు రాము, భోజారెడ్డి, తూర్పాటి వెంకటేశ్, సతీష్‌రావు, తదితరులున్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంత్యుత్సవాలకు రావాలని ఆహ్వానం

ముధోల్: మండల కేంద్రంలోని నయాబాది చౌరస్తాలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద సోమవారం 374వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముధోల్ మండల గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ముధోల్‌లో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, గౌడ సంఘం సభ్యులు తిరుపతిగౌడ్, సాయిబాబాగౌడ్, కార్తీక్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, బీజేపీ కార్యకర్తలు రమేశ్, సతీశ్‌రెడ్డి తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ఒంటికి, రెంటికి వెళ్లేదెలా..



లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి తలుపులు ఊడిపోగా.. నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో సమావేశాల సమయంలో ఒంటికి, రెంటికి వెళ్లేందుకు రైతులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్డికి తలుపులు బిగించి.. నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: గణేశ్, లోకేశ్వరం ఏవో, ఫోన్:72888 77916

గ్రామాల్లో పలువురికి సన్మానం

ముధోల్: ఇటీవల ఉత్తమ అవార్డులు పొందిన సీఐ మల్లేశ్, ఆశవర్కర్ యమునను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముధోల్‌లో సన్మానించారు. పతంగి కిషన్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, అజీజ్, దిగంబర్, ఖలీద్‌పటేల్, పోతారెడ్డి, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: కుంటాలకు చెందిన సబ్బిడి రాజు ఇంద్రవెల్లిలో ఎఫ్‌ఎస్‌వోగా.. ఓలా గ్రామానికి చెందిన హుస్సేన్ ఖానాపూర్‌లో డీఓపీగా పని చేస్తూ ఇటీవల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఆదివారం కుంటాలలో వారిని 1994–95 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి..

కుంటాల: మండలంలోని లింబా(కే) మాజీ ఎంపీటీసీ సునంద గిరీష్ పదవీకాలం ఇటీవల ముగిసింది. కాగా ఆ దంపతులను ఆదివారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ జవాన్ దయానంద్, వీణ, వీవోఏ గౌతమ్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రక్షాబంధన్



కార్యక్రమం ప్రారంభిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివకోటి మందిరం వద్ద రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ రాఖీలను పంపిణీ చేసి పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, సభ్యులు విగ్నేష్, ప్రకాశ్, సాయి, నవీన్, శ్రీను, యువరాజ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.